క్లుప్తంగా

ఘనంగా మొహర్రం వేడుకలు



సంతపేటలో కొలువుదీరిన పీర్లు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలో మంగళవారం మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సంతపేట, బజారువీధి ప్రాంతాల్లో పీర్లను కొలువుదీర్చి పూజలు చేశారు. డప్పు వాయిద్యాల నడుమ పీర్లను ఊరేగించారు. రాత్రి అగ్నిగుండ ప్రవేశాన్ని భక్తిశ్రద్ధలతో పూర్తి చేశారు.

ఆన్‌లైన్ బిల్లింగ్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో ఈఈ కార్యాలయంలోని ఆన్‌లైన్ బిల్లింగ్‌పై అవగాహన కల్పించారు. మంగళవారం ఎస్‌ఏఓ శ్రీనివాసులు బిల్లింగ్ కేంద్రం వద్ద వినియోగదారులతో మాట్లాడారు. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం తాత్కాలికంగా యూపీఐ యాప్స్ ద్వారా కరెంటు బిల్లుల చెల్లింపులు నిలిపివేశారన్నారు. ఏపీ ఎస్పీడీసీఎల్ యాప్ లేదా లింక్ ద్వారా నేరుగా బిల్లు కట్టవచ్చన్నారు. యూపీఐ యాప్స్‌లో గతంలో కట్టిన డబ్బులు మూడు రోజుల తర్వాత శాఖ ఖాతాలో క్రెడిట్ అయ్యేదన్నారు. కానీ సంస్థ యాప్‌లో కడితే ఎప్పటికప్పుడు ఖాతాలో పడుతుందన్నారు. వీటి వినియోగంపై అవగాహన కల్పించారు.

పకడ్బందీగా కుష్టు వ్యాధి సర్వే

యాదమరి(పూతలపట్టు): పకడ్బందీగా కుష్టు వ్యాధి సర్వే నిర్వహించాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ తెలిపారు. ప్రభుత్వం ఈ నెల 18 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు సర్వే చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. మండలంలోని ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు ఉప కేంద్రాల పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించి, స్పర్శలేని అనుమానిత వ్యక్తులను గుర్తించాలన్నారు. అలాంటి వ్యక్తులను గుర్తించి వైద్యంతోపాటు కుష్టు వ్యాధి నివారణకు కృషిచేస్తామని ఆయన పేర్కొన్నారు.

జ్వరాల బారిన పడకుండా జాగ్రత్తలు



విద్యార్థులతో వైద్యసిబ్బంది

గుడిపాల: జ్వరాల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని గుడిపాల ప్రాథమిక వైద్యాధికారి సంధ్య తెలిపారు. మంగళవారం గుడిపాల బాలికల వసతి గృహాన్ని ఆమె సిబ్బందితో వెళ్లి సందర్శించారు. పరిసరాల పరిశుభ్రత గురించి విద్యార్థులకు తెలియజేశారు. సిబ్బంది చంద్రశేఖర్, జబసెల్వి, ఉమ, విజయ, సులోచన, సుజిమ పాల్గొన్నారు.

హక్కులు, చట్టాలపై అవగాహన ముఖ్యం



మాట్లాడుతున్న సెబ్ ఏఎస్పీ సుబ్బరాజు

చిత్తూరు కలెక్టరేట్: మహిళలకు హక్కులు, చట్టాలపై అవగాహన ముఖ్యమని సెబ్ ఏఎస్పీ సుబ్బరాజు అన్నారు. మంగళవారం నగరంలోని సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాలలో చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు తప్పనిసరిగా హక్కులను తెలుసుకోవాలన్నారు. మహిళలకు రక్షణగా పోలీస్ శాఖ ఎప్పుడూ ముందుంటుందన్నారు. అనంతరం పలు చట్టాలను వివరించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మామిడి రైతులకు అవగాహన సదస్సు రేపు

తవణంపల్లె: మండలంలోని అరగొండ– గాజులపల్లె రోడ్డులోని శివాలయం దగ్గర ఉన్న గౌరీశంకర కల్యాణ మండపంలో ఈనెల 18న గురువారం ఉదయం 10 గంటలకు మామిడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. కాయల కోత అనంతరం చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన సదస్సు నిర్వహిస్తామని బంగారుపాళ్యం ఉద్యానశాఖ అధికారి సాగరిక తెలిపారు. సదస్సుకు శాస్త్రవేత్తలు, అధికారులు పాల్గొని సూచనలు ఇస్తారని వివరించారు. మామిడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.





చిత్తూరు నగరంలోని గిరిజన బాలుర వసతిగృహంలో ముద్ద కట్టిన అన్నం, రుచి లేని సాంబారు



చిత్తూరు నగరంలో వెనుకబడిన తరగతుల బాలుర వసతి గృహంలో నీటి వృథా



బంగారుపాళ్యంలో నిరుపయోగంగా ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్



చిత్తూరు నగరంలో వెనుకబడిన తరగతుల బాలుర వసతి గృహంలో సొంత ఖర్చులతో చాప తెచ్చుకుని నిద్రిస్తున్న విద్యార్థులు

సమస్యల సుడిలో సంక్షేమ బడి

గురుకుల, సంక్షేమ వసతి గృహాల్లో అధ్వాన పరిస్థితులు నెలకొన్నాయి. వేసవి సెలవుల తరువాత ఇటీవలే అధికారులు వీటిని పునఃప్రారంభించారు. అయితే వసతి గృహాలకు వస్తున్న విద్యార్థులకు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. గురుకుల పాఠశాలలు, వసతి గృహాల విద్యార్థులకు అవసరమైన కనీస సౌకర్యాలను కల్పించడంపై అధికారులు దృష్టి సారించకపోవడంతోనే ఈ పరిస్థితులు ఎదురవుతున్నాయి. సంక్షేమ వసతి గృహాలను గాలికి వదిలేయడంపై విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వసతి గృహాల నిర్వహణకు ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా చెల్లించడం లేదని, చీపురు, ఫినాయిల్ లాంటివి కొనుగోలు చేయడానికి కూడా నిధుల్లేకపోవడంతో నిర్వహణ ఎలా సాధ్యమని హాస్టల్ వార్డెన్లు వాపోతున్నారు.

– కాణిపాకం

- గురుకుల, సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు సమస్యల స్వాగతం
- అపరిశుభ్ర వాతావరణం, విరిగిన తలుపులు
- పలుచని సాంబారు.. రుచి లేని భోజనం
- అందుబాటులో ఉండని వార్డెన్లు
- అవస్థలతో తప్పని సహవాసం

ప్రాంతం	వర్గాల వారీగా వసతిగృహం	వసతుల సంఖ్య	విద్యార్థుల సంఖ్య
చిత్తూరు నగరం	బీసీ వసతి గృహాలు	05	1240
చిత్తూరు నగరం	ఎస్సీ వసతి గృహం	07	1145
చిత్తూరు నగరం	ఎస్టీ వసతి గృహం	02	450
పూతలపట్టు	అంబేడ్కర్ గురుకుల పాఠశాల	01	558
పూతలపట్టు	ఎస్సీ బాలుర వసతిగృహం	01	60
పూతలపట్టు (పి.కొత్త కోట)	ఎస్సీ బాలుర వసతిగృహం	01	40
ఐరాల	ఎస్సీబాలికల వసతిగృహం	01	58
ఐరాల	ఎస్సీ బాలుర వసతిగృహం	01	40
బంగారుపాళ్యం	ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్	01	118

చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గంలో గురుకుల పాఠశాలలు, వసతి గృహాల్లో వందలాది మంది విద్యార్థులున్నారు. వీరంతా నిరుపేద వర్గాలకు చెందిన వారే. వేసవి సెలవుల తరువాత ఇక్కడకు వస్తున్న విద్యార్థులకు ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఇప్పుడిప్పుడే వసతిగృహాలు తెరచుకోవడంతో ఆహారానికి సంబంధించిన సమస్యలను విద్యార్థులు చెప్పలేకపోతున్నారు. ముద్దలుగా ఉన్న అన్నంతో మింగలేక.. కక్కలేక పోతున్నారు. రుచిపచీలేని సాంబరుతో సర్దుకుంటున్నారు. కుళ్లిన కూరగాయలతో వండి పెడుతున్నారు. మెనూ ప్రకారం వడ్డించడం లేదు. పలు హాస్టళ్లలో మెనూకు కోత పెట్టారు. కేవలం ముద్దన్నం, ఉడికీ ఉడకని సాంబారుతో సరిపెడుతున్నారు. కోడిగుడ్లను మింగేస్తున్నారు. పాలు విద్యార్థులకు మింగుడు పడకుండా తాగేస్తున్నారు. వసతి గృహాలు తెరిచి వారం రోజులు కాకముందే బయటి నుంచి విద్యార్థులు టిఫిన్ తెచ్చుకుని తింటున్నారు. దీనిని బట్టి ఇక్కడ అందిస్తున్న ఆహారం నాణ్యత ఏపాటిదో అర్థమవుతోంది.

- పూతలపట్టు మండలం సంజీవరాయనపల్లిలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో మధ్యాహ్నం భోజనం అధ్వానంగా ఉంది. ఈ కారణంగా విద్యార్థులు వాంతులు, విరేచనాలకు గురువుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. అన్నంలో పురుగులు వస్తున్నాయని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరుగుదొడ్లు కంపు కొడుతున్నాయని వాపోతున్నారు. తాగునీరు లేక విద్యార్థుల గొంతెండిపోతోందని చెబుతున్నారు. దీనిపై బయట నోరు విప్పితే టీసీలు ఇచ్చి ఇంటికి పంపిస్తామని ఉపాధ్యాయులు విద్యార్థులను బెదిరిస్తున్నారని అధికారులకు ఫిర్యాదులు వెళ్తున్నాయి. ఉపాధ్యాయులు డ్యూటీలకు సక్రమంగా హాజరు కావడం లేదని, విద్యార్థుల వసతులపై చొరవ చూపడం లేదని అందులో పేర్కొన్నారు.
- పి.కొత్తకోట ఎస్సీ బాలుర వసతి గృహంలో వంట మనిషి డ్యూటీలో సక్రమంగా ఉండడం లేదు. మధ్యాహ్న భోజనం పిల్లలే వడ్డించుకుంటున్నారు. కూరగాయలు అన్నీ కూడా కుళ్లినవి వాడేస్తున్నారు. దానిపై ఈగలు వాలుతున్నాయి. అయినా వాటినే సాంబారుకు వాడుకుంటున్నారు.
- బంగారుపాళ్యంలోని ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్లో 118 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇక్కడ ప్రధానంగా మరుగుదొడ్ల సమస్య వేధిస్తోంది. భవనాల కొరత ఉండడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. తరగతి గదుల్లోనే బస చేస్తున్నారు. ఇక మినరల్ వాటర్ ప్లాంట్ మరమ్మతులకు గురై నిరుపయోగంగా ఉంది. తాగునీటికి విద్యార్థులు కటకటలాడుతున్నారు.
- ఐరాల మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల వసతి గృహం రక్షణ గోడ పడిపోయింది. తాగు నీటి వసతి లేక అల్లాడుతున్నారు. వసతి గృహంలో బోరు మోటార్ మరమ్మతులకు గురైంది. ఎస్సీ బాలుర వసతిగృహంలో మంచినీటి సౌకర్యం లేదు. దీనివల్ల తాగునీరు బయటి నుంచి తెచ్చుకుంటున్నారు.
- చిత్తూరు నగరంలోని గిరిజన కళాశాల బాలుర వసతి గృహంలో ముద్ద కట్టిన అన్నం వడ్డిస్తున్నారు. అది కూడా విద్యార్థులు వడ్డించుకుని తినాల్సిన పరిస్థితి. సాంబారులో కందిపప్పు తప్ప కూరగాయలు కనిపించడం లేదు. రుచి శూన్యం. గుడ్డు పెట్టడం లేదని విద్యార్థులు చెబుతున్నారు. పరిశుభ్రత ఆమడ దూరంలో ఉంది. విద్యార్థులకు ఇంత వరకు మ్యాట్‌లు ఇవ్వలేదు.
- చిత్తూరు నగరంలోని వెనుకబడిన తరగతుల బాలుర వసతి గృహంలో స్నానపు గదుల తలుపులు మూలకు చేరాయి. మరుగుదొడ్లు కంపు కొడుతున్నాయి. శుభ్రం చేసేవారు కరువయ్యారు. నీటి కొళాయిలు ద్వారా నీరు వృథా చేస్తున్నారు. తాగునీరు లేక విద్యార్థులు అల్లాడిపోతున్నారు. మోటారు మరమ్మతు కారణంగా పాఠశాలలో ఈ దుస్థితి ఉన్నట్లు విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక చాపలు, దుప్పటి ఇవ్వకపోవడంతో విద్యార్థులు నేల నిద్రలో కునుకు తీస్తున్నారు.



చిత్తూరులో వెనుకబడిన తరగతుల బాలుర వసతి గృహం

అందుబాటులో ఉండని వార్డెన్లు

సంక్షేమ శాఖ వసతి గృహాల వార్డెన్లు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలి. విద్యార్థులకు ఏ సమస్య వచ్చినా తక్షణమే స్పందించాలి. అయితే నగర పరిధిలోని వసతిగృహాల్లో వార్డెన్లు ఎవరూ అందుబాటులో ఉండడం లేదు. విద్యార్థులకు ఏవైనా సమస్యలుంటే వారికి చెప్పుకునేందుకు కూడా భయపడే పరిస్థితి నెలకొంది. విద్యార్థులతో మాట్లాడేందుకు అక్కడున్న సిబ్బంది అనుమతించకపోవడం గమనార్హం. విద్యార్థులను ఏమీ చెప్పనీయకుండా సిబ్బంది ఒత్తిడికి గురి చేస్తున్నారు.

పిల్లలు భయపడుతున్నారు



పూతలపట్టు గురుకుల పాఠశాలలో చదువుతున్న మా పిల్లల్ని చూడడానికి వస్తే వాళ్లు పడుతున్న ఇబ్బందులను మాతో చెప్పడానికి భయపడుతున్నారు. ఏవైనా సమస్యలు ఉన్నాయా అని అడిగితే వాళ్ల కాళ్లు చేతులు వణుకుతున్నాయి. బాగా చదువుకుంటారనే ఉద్దేశంతో గురుకుల పాఠశాలలో చేర్పిస్తే.. వాళ్ల బాధను ఎవరికీ చెప్పుకోలేక ఇబ్బందులు పడుతుంటే మాకు ప్రాణం పోయేలా ఉంది. గురువు అంటే విద్యార్థులకు భయం ఉండాలి, కానీ వాళ్ల సమస్యలను బయటకి చెప్పడానికి కూడా చచ్చేంతలా భయం ఉండకూడదు.

- నాగరాజ్, శ్రీకాళహస్తి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ చంద్రమహేష్



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత

గుడిపాల: సీజనల్ వ్యాధులపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని గుడిపాల ప్రాథమిక వైద్యాధికారి చంద్రమహేష్ అన్నారు. మంగళవారం చిత్తపార గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్న నేపథ్యంలో జ్వరం, జలుబు, దగ్గు వంటి లక్షణాలు ఉన్నట్లయితే వెంటనే ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సంప్రదించాలన్నారు. అనంతరం బీపీ, షుగర్, గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మాత్రలను అందజేశారు. వైద్యసిబ్బంది చంద్ర, హేమలత, మంజుల, ఇందుమతి పాల్గొన్నారు.

ఐరాల: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత సూచించారు. మండలంలోని నాంపల్లెలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 80 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. దీర్ఘకాలిక రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని మందులు అందజేశారు. డాక్టర్ మాట్లాడుతూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పెట్టుబడి సాయం అందేనా?



జెట్టిపల్లె దగ్గర సిద్ధంగా వరినారు



సాగుకు సిద్ధం చేసిన పొలం

తవణంపల్లె: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు పెట్టుబడి సాయం కోసం ఎలాంటి భరోసా అందక.. వ్యవసాయం ముందుకు సాగడం లేదు. రైతుకు ప్రభుత్వం ఎలాంటి భరోసా కల్పించడం లేదు. దీంతో రైతులు ఈ ఏడాది వ్యవసాయం ఎలా సాగు చేయాలో తెలియక సాయం కోసం ఎదురు చూస్తున్నారు. గతంలో పంటల సాగు కోసం వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం సకాలంలో రైతు భరోసా కింద పెట్టుబడి అందించేది. ఇప్పటి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పేరు పెట్టి ఇప్పటి వరకు ఎలాంటి ఆర్థిక సహాయం చేయక మొండి చెయ్యి చూపుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సాగు లక్ష్యం సాధించేనా?

పెట్టుబడి సాయం అందకపోవడంతో ప్రభుత్వం నిర్దేశించిన సాగు లక్ష్యం అధిగమించడం కష్టంగా ఉంది. మండలంలో 6957 మంది రైతులు ఉన్నారు. వాణిజ్య పంటగా వరిని సాగు చేస్తున్నారు. మండలంలో 360 ఎకరాల్లో వరి సాగు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా ఎంచుకొంది. రైతులు సాగు చేయడానికి విముఖత చూపుతున్నారు. కానీ కొంత మంది రైతులు అప్పులు చేసి సాగు చేయడానికి ప్రయత్నిస్తున్నారు. రైతులు నార్లు పోసి, దుక్కులు దున్ని సిద్ధం చేస్తున్నారు. కానీ రైతులకు ప్రభుత్వం భరోసా కల్పించకపోవడంతో ఎలా సాగు చేయాలనే సందిగ్ధంలో ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ కింద రూ.2 వేలు రైతుల ఖాతాల్లోకి జమ చేసింది. గతంలో పీఎం కిసాన్ నిధులతో పాటు వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం ముందస్తుగా రైతులకు సాయం అందించి ఆదుకుంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత బ్యాంకు రుణాలు కూడా అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి

రైతులకు పంటల సాగుకు పెట్టుబడి సాయంపై కొత్త ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి. మాకు ఇప్పటి వరకు ప్రభుత్వం ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేదు. మండలంలో 360 ఎకరాల్లో వరిసాగు చేయాలనేది లక్ష్యం. రైతులు నార్లు పోసి దుక్కులు దున్ని సిద్ధ చేస్తున్నారు. మండలంలో ఇప్పటి వరకు సుమారు 10 ఎకరాల్లో మాత్రం వరి నాట్లు వేసి సాగు చేశారు. రైతులకు రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయి.

- జి. ప్రవీణ్, వ్యవసాయాధికారి, తవణంపల్లె

వాటర్ బాటిళ్లకు స్వస్తి

–ఇక అందరికీ మినరల్ వాటర్ ప్లాంటు నీళ్లు

సాక్షి ఎఫెక్ట్..

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో అందరికీ శుద్ధి నీటిని అందుబాటులో ఉంచుతామని డీఈ వెంకటరమణ తెలిపారు. 'సాక్షి' దినపత్రికలో మంగళవారం 'ప్రజాధనం నీళ్ల పాలు' శీర్షికన ప్రచురించిన కథనంపై ఆయన స్పందించారు. అధికారులకు వాటర్ బాటిళ్లను ఇవ్వడం.. సిబ్బందికి, ప్రజలకు ఉచిత మినరల్ వాటర్‌ప్లాంటు నుంచి నీళ్లు ఇవ్వడంపై ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ అభ్యంతరం వ్యక్తం చేశారని డీఈ తెలిపారు. అధికారులకు సైతం వాటర్ బాటిళ్లను నిలుపుదల చేసి, కార్యాలయంలో ఉన్న ప్లాంటు నుంచే ఉచిత నీటిని అందుబాటులో ఉంచాలని ఆదేశించినట్లు చెప్పారు. ప్లాంటు నీటిలో ఉన్న పీహెచ్ విలువలను సైతం సరిచేసి, అందరినీ ఇదే నీటిని సరఫరా చేస్తున్నట్లు డీఈ తెలిపారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక రేపు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈ నెల 19వ తేదీన సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. చిత్తూరు నగరంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సభ ఏర్పాటు చేశామని, ఉదయం 10 గంటలకు వేదిక ప్రారంభమవుతుందన్నారు. ఉపాధి కూలీలు, అధికారులు, సిబ్బంది పాల్గొనాలని ఆయన కోరారు.

కాణిపాకంలో రాష్ట్ర మంత్రి

కాణిపాకం: రాష్ట్ర భూగర్భ వనరులు, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మంగళవారం కాణిపాకం చేరుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు, నాయకులు స్వాగతం పలికారు. రాత్రి స్థానిక అతిథిగృహంలో బస చేశారు. ఉదయం వరసిద్ధి వినాయక స్వామి అభిషేక పూజలో మంత్రి పాల్గొననున్నారు.

మెడికల్ బిల్లుల మంజూరులో జాప్యం వద్దు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఉపాధ్యాయులు, ఉద్యోగులకు సంబంధించిన మెడికల్ బిల్లుల మంజూరులో తీవ్ర జాప్యాన్ని నివారించాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఎస్టీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మదన్‌మోహన్‌రెడ్డి, బోడే మోహన్ యాదవ్ కోరారు. చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని మంగళవారం మెడికల్ సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్‌కు వినతి పత్రాన్ని సమర్పించి, సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనారోగ్య సమస్యలతో ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి చికిత్స పొంది, మెడికల్ బిల్లుల మంజూరు కోసం దరఖాస్తు చేసుకుంటున్నారని తెలిపారు. వాటిని త్వరితగతిన పరిష్కరించేలా చూడాలని వారు కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు గంటా మోహన్, నేతలు ఉన్నారు.

ఎన్నిసార్లు చెప్పినా మారరా?

- సిబ్బందిపై ఈఈ అసహనం



సమీక్షిస్తున్న ఎస్ఏఓ శ్రీనివాసులు, ఈఈ హరి

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ బిల్లుల ఆన్‌లైన్ చెల్లింపులో వచ్చి కొత్త పద్ధతిపై ప్రచారం చేయండి అని చెప్పాం.. అయినా మీరు చేయలేదు ఎన్నిసార్లు చెప్పినా మారరా అని ట్రాన్స్‌కో రూరల్ ఈఈ హరి సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. మంగళవారం రూరల్ ఈఈ కార్యాలయంలో ఏఈఓ, జేఏఓ, ఏఈలతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. సీనియర్ అకౌంట్ ఆఫీసర్ (ఎస్ఏఓ) శ్రీనివాసులు, టెక్నికల్ ఈఈ శ్రీనివాసులురెడ్డి సమావేశానికి తిరుపతి నుంచి వచ్చారు. ఆన్‌లైన్ పేమెంట్స్ ఎందుకు తక్కువగా ఉందని ఎస్ఏఓ సిబ్బందిని ప్రశ్నించారు. ప్రస్తుతం యూపీఐ పేమెంట్స్‌లో బిల్లింగ్ ఆప్షన్ తీసివేశారన్నారు. ఏపీ ఎస్పీడీసీఎల్ సైట్, యాప్, లింక్ ఈ ఆప్షన్‌లో ఒక దానిలో పేమెంట్స్ నేరుగా కట్టవచ్చన్నారు. వీటిపై ఇంకా పూర్తిస్థాయిలో అవగాహన లేదన్నారు. దీనిపై ఈఈ స్పందిస్తూ పది రోజుల ముందే వీటిపై గ్రామాల్లో ప్రచారం చేయాలని ఆదేశించామన్నారు. చెప్పిన పని సక్రమంగా చేయరా అని అసహనం వ్యక్తం చేశారు. డీఈలు కొండయ్య, సుబ్రమణ్యం, ఏఏఓ గీత, జేఏఓ ధనలక్ష్మి, ఏఈలు రామిరెడ్డి, తనిగవేలు, గుర్రప్ప, కిరణ్, బాలాజి, చలపతి, కృష్ణకిషోర్ పాల్గొన్నారు.

దోమ కాటుకు గురికాకుండా జాగ్రత్తలు



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్

తవణంపల్లె: దోమ కాటుకు గురికాకుండా ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని దిగువ మత్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో 45 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం గర్భిణులకు, బాలింతలకు, వృద్ధులకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. మధుమేహ వ్యాధిగ్రస్తులు డైటింగ్ చేయాలన్నారు. గర్భవతులు తాజా ఆకుకూరలు, కూరగాయలు తినాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఇచ్చే పౌష్టికాహారం, కోడిగుడ్లను గర్భవతులు, బాలింతలు తినాలన్నారు. పల్లెల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా ఉండాలంటే డ్రైడే తప్పక పాటించాలని సూచించారు. దోమలు నియంత్రణకు వేపాకు పొగ వేసుకోవడం మంచిదన్నారు. సీహెచ్ఓ రాజామణి, హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యంరెడ్డి, ఏఎన్ఎం చాముండేశ్వరి, ఎంఎల్‌హెచ్‌పీ జాహ్నవి, డీఈఓ విజయలక్ష్మి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తం

వి.కోట: సైబర్ నేరగాళ్లతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ విష్ణు రఘువీర్ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. డీఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్‌లో అమ్మాయిల ఫొటోలను మార్ఫింగ్ చేసి వాళ్ల మానప్రాణాలతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. సెల్‌ఫోన్‌ల దుర్వినియోగం కారణంగా పలువురు నష్టపోతున్నట్లు వెల్లడించారు.

కొందరు యువతీయువకులు తెలిసీ తెలియక మత్తు పదార్థాలను అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు జల్సాలకు అలవాటు పడి చిన్న వయసులోనే నేరాలకు పాల్పడుతున్నారన్నారు. మైనర్లు బైక్‌లు నడిపి వారి ప్రాణాలనే కాకుండా ఎదుటివారిని కూడా ప్రాణాపాయానికి గురిచేస్తున్నారని వివరించారు. అనంతరం రోడ్డు భద్రతా నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐ లింగప్ప, ఎస్ఐ బాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ విష్ణు రఘువీర్